క్లుప్తంగా

రైలు ప్రమాద మృతులకు ఎమ్మెల్యే కొడాలి సంతాపం

గుడివాడరూరల్: ఒడిశా బలేశ్వర్ జిల్లా బహనాగ్‌రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రైల్వే ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సంతాపం తెలిపారు. దేశ చరిత్రలోనే ఇలాంటి రైల్వే ప్రమాదం ఎప్పుడు జరగలేదని, ఇలాంటి ప్రమాదం జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు అండదండలుగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన రోజు దేశ చరిత్రలో చీకటి రోజుగా కొడాలి నాని అభివర్ణించారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం శివారు ఐనంపూడి బలుసులమ్మ ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏటా బలుసులమ్మవారి సంబరాలు ఘనంగా నిర్వహిస్తారు. అమ్మవారి సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో స్వామి, వల్లీదేవసేన అమ్మవారి విగ్రహాలను అందంగా అలంకరించి నేత్రపర్వంగా కల్యాణాన్ని జరిపారు. ఆదివారం గ్రామంలో బలుసులమ్మవారి ఊరేగింపు భారీ ఎత్తున నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త పెద్దింటి కృష్ణమూర్తి తెలిపారు.

మజ్జిగ పంపిణీ

గుడివాడరూరల్: పట్టణంలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేసవిలో భాగంగా ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రం 20వ రోజు శనివారం ద్విగ్విజయంగా కొనసాగుతుంది. వెలమ సంక్షేమ సంఘం నాయకులు గోర్జి సత్యనారాయణ, గంటా ఆనంద్, మూడెడ్ల రామారావు ప్రోత్సాహంతో నెహ్రూ చౌక్ వద్ద వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామానికి చెందిన వెలమ సంఘీయులు మజ్జిగ పంపిణీకి సహకారం అందించారు. కార్యక్రమంలో వెలమ సంఘీయులు నూకల సత్యానారాయణ, బి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

పామర్రు: బాలింతాలకు పౌష్టికాహారం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్ అన్నారు. మండలంలోని పెదమద్దాలి, శివారు కొండయ్య పాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న (యూ.ఐ.పి) టీకా కార్యక్రమాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుచున్న (యూఐపీ) టీకా కార్యక్రమం సంబంధించిన ఏపీ ఏఎన్ఎం యాప్‌లో ఖాళీలు లేకుండా చూడాలని స్థానిక ఏఎన్ఎంలను ఆదేశించారు. గర్భిణులకు బాలింతాలకు మంచి ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారుల తల్లిదండ్రులకు పోషకారం వలన కలిగే లాభాలను వివరించారు. ప్రస్తుతం ఉన్న ఎండ తీవ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తాలను వివరించారు. కార్యక్రమంలో కనుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వంశీ కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళతో రైతులకు మేలు



తోట్లవల్లూరు: వైఎస్సార్ జలకళ పథకంతో రైతులకు ఎంతో మేలు కలుగుతోందని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని బొడ్డపాడులో వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన బోరు పనులను శనివారం ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. చినపులిపాక సర్పంచ్ శివరామకృష్ణ(రాము), ఎంపీటీసీ సభ్యురాలు రోజారాణి, పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి, నాయకులు ఫణికుమార్, నాగగోపి, రైతు రాజేశ్వరి పాల్గొన్నారు.

చివరి దశకు చేరుకున్న అభివృద్ధి పనులు

పరిశీలించిన ఎమ్మెల్యే కొడాలి నాని



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: గుడివాడ మల్లాయపాలెం టిడ్కో లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) వివిధ శాఖల అధికారులతో కలసి శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో లేఅవుట్‌లో ఇటీవల చేసిన ప్రత్యేక ఏర్పాట్లను సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గుడివాడలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మల్లాయపాలెం టిడ్కో లేఅవుట్‌లో అభివృద్ధి పనులన్నీ చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఈ నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుడివాడ పర్యటన తేదీ ఖరారు అవుతుందన్నారు. మోడల్‌టౌన్ షిప్ మాదిరి టిడ్కో లేఅవుట్ అభివృద్ధి చెందడం సంతోషకరమన్నారు. ప్లాట్ల లబ్ధిదారులకు అతి త్వరలోనే తమ ఇళ్లను అప్పగించనున్నట్లు ఎమ్మెల్యే నాని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ గోర్జి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, హౌసింగ్ డీఈలు రామోజీనాయక్, నిరీక్షణరావు, హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరులో శ్రీగంగాభవానీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఆలయాన్ని నిర్మించేందుకు గ్రామస్తులంతా ఏకమై ముందుకు వచ్చారు. దీనికి నీలిపల్లి సతీష్ స్థలాన్ని ఉచితంగా అందజేశారు. ఈ స్థలంలో నిర్మించే ఆలయ నిర్మాణానికి వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి గునశెట్టి సింహాచలం దంపతులు పీటలపై కూర్చొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిన గ్రామస్తులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ రెడ్డి సతీష్, ఈడేపల్లి సర్పంచ్ అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, కృష్ణారావు, శ్రీనివాసరావు, మైనర్‌బాబు, వీరాంజనేయులు, భట్రాజు రవి, బత్తుల నాని, వర్రే శశిధర్, స్థానిక సోమేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గులిపల్లి సుధారాణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి విఘాతం

గుడివాడరూరల్: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి విఘాతమని, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాజాత కళాకారులు పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీన పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం గుడివాడలోని పలు ప్రాంతాల్లో కళాజాత కళాకారులు ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు పర్యావరణానికి విఘాతమన్నారు. మానవ జీవితంలో అనర్థాలను మిషన్ లైఫ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత సభ్యులు ప్రదర్శన ద్వారా ప్రజలకు వివరించారు.

పాతికేళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం

- ఆనందరావుపేట వాసుల హర్షం
- కుళాయిలను ప్రారంభించిన ఎమ్మెల్యే డీఎన్నార్



కుళాయిలను ప్రారంభించి, నీటిని సరఫరా చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీపీ అడవి కృష్ణ

కైకలూరు: పాతికేళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో ఆచవరం శివారు ఆనందరావుపేట వాసులు పట్టరాని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆచవరం రక్షిత మంచినీటి పథకం నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలో ఆనందరావుపేటకు ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను కుళాయిలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం ప్రారంభించారు. జలజీవన్ మిషన్ పథకం నుంచి రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధుల నుంచి రూ.4 లక్షలు వెరసి రూ.14 లక్షలతో పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిమిత్తం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే డీఎన్నార్ తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ సహకారంతో పాతికేళ్ల తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. నూతన పైపులైను ద్వారా 150 కుటుంబాలకు కుళాయిలు సమకూరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, సర్పంచ్ కట్టా నాగరాజు, ఉప సర్పంచ్ జంగం వెంకటరాజు, నాయకులు ధర్మరాజుల సూర్యనారాయణ, దండే సైమన్‌రాజు, తోట మహేష్, వాసుపల్లి తాతారావు, బూరుబోయిన శ్రీనివాస్, బుర్ల పోతురాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితుల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు

గుడివాడరూరల్: ఒడిశా బలేశ్వర్‌జిల్లా బహనాగ్ రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రైల్వే ప్రమాదంలో గాయపడిన వారి వివరాల కోసం గుడివాడ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు, రైల్వే స్టేషన్ మేనేజర్ సిబ్బందితో కలసి స్టేషన్‌లో శనివారం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. గాయపడిన ప్రయాణికుల సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లను తెలిపారు. గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ 08674-244352, ఆర్‌పీ ఎస్ఐ బి.వెంకటేశ్వర్లు సెల్ 9440627570, ఆర్‌పీ పీహెచ్‌సీ కేఎస్ శ్రీనివాసరావు సెల్ 9866221412 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. క్షతగాత్రుల వివరాలు తెలుసుకోవాలంటే ఈ నంబర్లలో సంప్రదించాలని రైల్వే సిబ్బంది కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి మార్కింగ్

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరం గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ సాంబశివ స్వామి వారి నూతన ఆలయ పునర్నిర్మాణానికి శనివారం దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ స్థపతి, అధికారులు శనివారం మార్కింగ్ చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే డీఎన్నార్, గ్రామ ప్రముఖుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

మండుతున్న ఎండలతో రహదారుల నిర్మానుష్యం

కైకలూరు: రోహిణికార్తెలో ఎండలు మండిపోతున్నాయి. వడగాడ్పుల ధాటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం ఏడు గంటలకే ఎండ తీవ్రత కనిపిస్తోంది. ఉదయం 11 గంటల నుంచి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గాలిలో తేమ అధికంగా ఉండటంతో ప్రజలు రాత్రి 10 గంటలు దాటినా ఉక్కపోతను అనుభవిస్తున్నారు. ఏలూరు జిల్లా కైకలూరులో శనివారం 40 డిగ్రీల సెంటీగ్రేట్ ఉష్ణోగ్రత నమోదైంది. విపత్తుల నిర్వహణ సంస్థ మరో కొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతోందని హెచ్చరించడంతో ప్రధానంగా ఆక్వా రైతులు బెంబేలెత్తుతున్నారు.

శ్యామలాంబకు బంగారు హారం బహూకరణ



హారాన్ని అందిస్తున్న శ్రీనిసాగర్ కుటుంబ సభ్యులు

కైకలూరు: స్థానిక ప్రజల ఆరాధ్య దైవం శ్యామలాంబ అమ్మవారికి లక్కాప్రగడ శ్రీనిసాగర్, కృష్ణకిషోర్ సోదరులు రూ.1.80 లక్షల విలువజేసే 24.290 గ్రాముల బంగారపు కంఠాహారం(చౌకర్)ను సమర్పించారు. ఈ హారాన్ని ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్‌కు శనివారం అందించారు. లక్కాప్రగడ వెంకట శ్యామల గౌరీశ్వర ప్రసాద్, సత్యవతి దంపతులు పూర్వం శ్యామలాంబ అమ్మవారి సమీపంలో నివాసం ఉండేవారు. గౌరీశ్వర ప్రసాద్ లెక్చరర్‌గా ఇక్కడ విధులు నిర్వహించారు. అనంతరం హైదరాబాదులో స్థిరపడ్డారు. వీరి కుమారుడు శ్రీనిసాగర్ ముక్కుపుడక, బ్రహ్మముడి, గుండమ్మ కథ, రజనీకాంత్ నటించిన జైలర్ సినిమాల్లో నటించారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఐదుగురు ఎంపిక

మొవ్వ: నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్ షిప్‌న (ఎన్ఎంఎంఎస్)కు మొవ్వ మండలంలోని మూడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు శనివారం తెలిపారు. మండలంలోని తొమ్మిది పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకాగా చినముత్తేవి జెడ్పీ పాఠశాల నుంచి పి.సుశాంత్ రాజు, మొవ్వ శ్రీ మండవ కనకయ్య జెడ్పీ పాఠశాల నుంచి కే వైశాలి, యు మధు శ్రీ, కాజ పేకేటి జెడ్పీ పాఠశాల నుంచి ఆర్ చైత్రశివనాగసాయి శ్రీ, ఎస్ ఓంకార్ ఎంపికైనట్లు హెచ్ఎంలు ఎస్ సాయికుమార్, ఎస్‌వీ శ్రీధర్, బి.రమాదేవి వెల్లడించారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

మొవ్వ: వేసవి సెలవలు ఈ నెల 12వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో పాఠశాలల పునఃప్రారంభం నాటికి నాడు-నేడు పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎన్.శివశంకరరావు సూచించారు. మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ఎమ్మార్సీ భవనంలో శనివారం మండల పరిషత్, జెడ్పీ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రికల్ వర్క్స్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, వంట గదులు, మేజర్, మైనర్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే నాలుగో విడత జగనన్న విద్యా కానుక కిట్లు ఈ నెల 5వ తేదీ నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో హెచ్ఎంలు ఎస్‌వీ శ్రీధర్, బండి రమాదేవి, బాదర్ల నాగమిణి, సమగ్ర శిక్ష అభియాన్ ఇంజినీర్ జి.శ్రీనివాసరావు, సీఆర్‌పీలు తాతా సమర్పణరావు, కంచర్ల ఆంజనేయులు, పీ కృష్ణార్జునరావు, చీలి నాగరాజు, సీహెచ్ శ్రీమన్నారాయణ, సీహెచ్ఎస్ హిమజ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఉపాధి పనులు దోహదం

మండవల్లి: గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పనులు దోహదం చేస్తున్నాయని ఇన్‌చార్జి ఏపీఓ ఎస్ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని లింగాల గ్రామంలో రూ. 60వేల అంచనా విలువతో ఊర చెరువు అభివృద్ధి పనులను శనివారం 34 మంది కూలీలు నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం

ముదినేపల్లి రూరల్ : స్థానిక మెడికల్ షాపు వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన అను హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సంతానలేమితో బాధపడుతున్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు అందజేశారు. అదేవిధంగా బీపీ, షుగర్, థైరాయిడ్‌కు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సుకీర్తి, అజయరాజు, రోహిణి, నాగరత్నం వైద్య పరీక్షలు నిర్వహించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

గుడివాడరూరల్: గుడివాడ పురపాలక సంఘంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేసిన నర్రా చక్రధరరావు(85) శనివారం రాత్రి కన్నుమూశారు. ఉపాధ్యాయుడిగా కాకుండా కళాకారుడిగా అందరి మన్ననలు పొందారు. దర్శకుడిగా, రచయితగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకుడిగా బహుముఖ సేవలు అందించారు. దేశ రక్షణ, సత్రంలో విచిత్రం తదితర నాటికలకు దర్శకత్వం వహించారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

గుడివాడరూరల్: బాణసంచా దుకాణాల్లో విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలను దుకాణదారులు చేపట్టాలని గుడివాడ టూటౌన్ సీఐ బెజవాడ తులసీధర్ పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరులో బాణసంచా దుకాణాల్లో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ జాషువా ఇచ్చిన ఆదేశాల మేరకు గుడివాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాణసంచా దుకాణాలను సీఐ తులసీధర్ తన సిబ్బందితో శనివారం పరిశీలించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేసి వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని హనుమంతపురం గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అని ఆరా తీశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగిన వారికే పథకాలు అందేవన్నారు. నేడు పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. చంద్రబాబు మాటలు ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, సర్పంచ్ కలపాల రాంబాబు, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి గంగరాజు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, మాజీ సర్పంచ్ పరుచూరి విజయరాణి, నాయకులు యేనుగ మస్తాన్‌రావు, పామర్తి గౌతు, ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ట చేసిన గంగానమ్మ తల్లి విగ్రహం

పెదపారుపూడి(యలమర్రు): మండలంలోని యలమర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగానమ్మ తల్లి విగ్రహ జీర్ణోద్ధారణ విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గంగానమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టింపజేశారు. ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. సుమారు ఆరు వేల మందికి అన్న సమారాధన చేశారు.

ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉంటే అంతా మంచి జరుగుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని యలమర్రులో గంగానమ్మ తల్లి పున:ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్ని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తి భావన కలిగి ఉన్న వారు సమాజానికి తమ వంతు సహకారం అందిస్తారన్నారు. ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, పామర్రు మార్కెట్ యార్డు డైరక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ముస్తాబు

కైకలూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి కైకలూరు తాలూకా సెంటర్ ముస్తాబవుతోంది. తహసీల్దార్ బి.మురళీ కృష్ణ రెవెన్యూ కార్యాలయ ఎదుట ప్రహరీ గోడకు రంగులతో సుందరంగా తీర్చుదిద్దుతున్నారు. సోమవారం జరిగే పర్యావరణ దినోత్సవం రోజున ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుతో రహదారి సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శనివారం తెలిపారు.

మేలుజాతి పశువులతో అధిక పాల దిగుబడి

డీఏహెచ్ఎం జేవీ రమణయ్య



ప్రథమ స్థానం పొందిన లేగదూడ యజమానికి బహుమతి, మందులు అందజేస్తున్న అధికారులు

పమిడిముక్కల: మేలుజాతి పశువుల పెంపకం ద్వారా అధిక పాలదిగుబడి సాధించాలని మచిలీపట్నం డీఏహెచ్ఎం జేవీ రమణయ్య తెలిపారు. కపిలేశ్వరపురం పశువైద్యశాలలో శనివారం పశు కృత్రిమ గర్భధారణ, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రమణయ్య మాట్లాడుతూ పశుసంవర్థక శాఖలో రైతులకు ఉన్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. రాయితీపై బలవర్ధకమైన దాణా అందిస్తున్నామన్నారు. ఈఓడీఎల్‌డీఏ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు పెయ్య దూడలు పుట్టేందుకు ప్రత్యేకంగా వీర్యాన్ని ఉచితంగా అందజేస్తుందన్నారు. పెయ్యదూడలు పెరిగితే పాడిపరిశ్రమ అభ్యున్నతికి తోడ్పడతాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేగదూడల ప్రదర్శనలో వీరంకి లాకేష్ ప్రథమస్థానం, మార్నెళ్ల గురవయ్య ద్వితీయస్థానం, మాటూరి గోవిందబాబు తృతీయ స్థానం, మండవ రాఘవేంద్రరావు నాలుగో స్థానం పొందినట్లు వైద్యాధికారి ఎం. వెంకటేష్ తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు, లేగదూడలకు అవసరమైన మందులు కూడా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ శశికుమార్, వీఏఎస్‌లు రాంనరేష్, ఈశ్వర్, సర్పంచ్ బుల్లా నాగమణి, ఎంపీటీసీ కంచర్ల అంకకుమారి, ఉపసర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పురాతన కట్టడాల ప్రాముఖ్యతపై అవగాహన

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పురాతన కట్టడాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రపంచంలోని ఏడు వింతల గురించి వివరించారు. విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రకాల యాక్టివిటీస్‌పై అవగాహన ఉండటం ఎంతో అవసరమని పర్వీన పేర్కొన్నారు.

ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణ

ముదినేపల్లి రూరల్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు జి.బాబురావు గ్రామర్ గురించి సులభశైలిలో విద్యార్థులకు బోధించారు. లైబ్రేరియన్ ఎన్ శ్రీదేవి, టి అంకిత ఆధ్వర్యంలో కేరమ్స్, చెస్, రింగ్ వంటి క్రీడలను నిర్వహించారు.

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్నరామచంద్రారెడ్డి, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

గుడివాడరూరల్: ఆపదలో ఉన్న అభాగ్యులను ఆదుకోవడం, ప్రజలకు మేలు చేయడమే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ముఖ్య ఉద్దేశమని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. గుడివాడ పట్టణంలోని మానవతా కుటుంబ సభ్యుల ద్వారా సేకరించిన రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన శాంతిరథం(వైకుంఠ రథం)ను సంస్థ సభ్యులతో కలసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమన్నారు. అనంతరం 2023-24 మానవతా స్వచ్ఛంద సంస్థ డైరీని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ కోటేశ్వరరావు, గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణతో కలసి ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షురాలు జయలక్ష్మీ, కార్యదర్శి సరస్వతి, కోశాధికారి గోపిరెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేష్ నాయుడు పాల్గొన్నారు.